# కుక్క కరిచింది...!

"ఏమండోయ్! మిమ్మల్నే! ఆంజనేయులుగార్ని కుక్క కరిచిందట.. పాపం! ఓసారి వెళ్ళి పరామర్శించి రాకూడదూ?" సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి రాగానే శ్రీమతి టీకప్పు చేతికిస్తూ సానుభూతిగా అంది.

ఏమిటి...? ఆంజనేయుగార్ని కుక్క కరవడమా...? కలా.. నిజమా? అంటూ నేనూ ఆశ్చర్యపడలేదుగానీ... నా చేతిలోని టీకప్పులో తుఫానొచ్చినట్లుగా అదిరిపడి... సగం టీతో నా చొక్కాను తడిపేసుకున్నాను.

"ఆంజనేయులును కుక్క కరవడమేమిటి...? ఆంబోతు లాంటి మనిషి...! ఆయనే పదికుక్కల్ని వరుసబెట్టి కరుస్తాడు.!" కప్పులో మిగిలిన టీని చప్పరిస్తూ మందహాసంతో అన్నాను.

"నిజమే నండీ! మహానుభావా ! నా మాట నమ్మకపోతే... ఓసారి చూసి రండి! పొద్దుట బాబిగాడ్ని తీసుకుని విజయా నర్సింగ్ హోమ్‌కు వెళ్ళానా ఆంజనేయులుగారు అక్కడ బెంచిమీద కూర్చుని కనిపించారు. ఎందుకో ఆయన ముఖం ఎర్రగా, కందగడ్డలా ఉంది. ఏంటిటి అన్నయ్యగారూ ఇలా వచ్చారని పలకరించాను అంతే, కుక్క కరించిదమ్మా ఇంజక్షను చేయించుకోవాలి అంటూ కోపంతో కుక్క అరిచినట్టే అరిచి డాక్టరు గదిలోకి దూసుకుపోయారంటే నమ్మండి"!

శ్రీమతి నొక్కి చెప్పడంతో నేను నమ్మక తప్పలేదు. నేను నిర్ణయానికి వచ్చి గబగబా బట్టలు మార్చుకున్నాను. ఆంజనేయులు ఇంటికి ఆదరాబాదరాగా బయలుదేరాను.

ఆంజనేయులు ఎవరో కాదు. సాక్షాత్తు మా ఇంటి యజమాని. అపర దుర్వాసుడు. ఒంగోలుజాతి ఆంబోతులా ఎత్తుగా, పొడుగ్గా, పొగరుగా ఉంటాడు. అతనికి ఎదుట మనుషుల మీద నమ్మకం తక్కువ. ప్రపంచంలోని మనుషుల్ని, మనస్తత్వాల్ని, ఔపోసన పట్టేశాను సుమా! అన్న అహం ఆంజనేయులి ప్రతిమాటలోనూ, చూపులోనూ కనపడుతుంది. వీధి చివరే అతగాడి ఇల్లు. ఊళ్ళో మూడు ఇళ్ళు ఉన్నాయి. ఒక ఇంట్లో తాను ఉంటూ రెండు ఇళ్ళు అద్దెకు ఇచ్చాడు. మూడిళ్ళూ అతని తండ్రి, తాత సంపాదించి పెట్టినవే.

అద్దెలు పెంచడంలోనూ వసూలు చేయడంలోనూ, ఆంజనేయులు నక్షత్రకుడి లక్షణాలను పుణికి పుచ్చుకున్నాడు. అతనికి మునిసిపాలిటీలో ఉద్యోగం కూడా ఉంది. అదే ఇంటింటికి తిరిగి, ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, వసూలు చేయడం..! చేసేది బిల్లు కలెక్టరు ఉద్యోగమయినా, 'జిల్లా' కలెక్టరులా డాబూ, దర్పం ప్రదర్శిస్తుంటాడు.

ఆంజనేయులుకి ముగ్గురు పిల్లలు, ముగ్గురూ ఆడపిల్లలే... మురికితో ఉన్న ముత్యాల్లా ఉంటారు. వాళ్ళనెప్పుడూ నేను శుభ్రమైన బట్టల్లో చూడలేదు. వీధి వరండా కటకటాల్లోంచి బెరుకు బెరుకుగా ... భయం, భయంగా తొంగిచూస్తుంటారు. భార్య అనసూయమ్మ, సాధ్వి, సాత్వికురాలు! ఇంటికి దీపంలాగే ఉంటుంది. ఆంజనేయుల్లాంటి

మనిషికి, ఈమె భార్య ఎలా అయిందో అనుకుంటే... ఎవరో, ఎప్పుడో, పెళ్ళిపేరిట, ఆమె పట్ల ఘోరమైన తప్పు చేసారనిపిస్తూంది! మా వీధిలో నడిచే వాళ్ళందరికీ ఆంజనేయులు గొంతు బాజా మ్రోగించినట్లుగా వినపడుతూ ఉంటుంది. భార్యగానీ, అతని పిల్లలుగానీ ఆ గొంతుక్కి సమాధానాలు చెప్పినా దాఖలాలు కనిపించవు... వినిపించవు.! ఆలోచిస్తూ నేను ఆంజనేయులు ఇంటికి వెళ్ళేసరికి అతగాడు వీధి వరండాలో... వాలుకుర్చీలో కాళ్ళు చాపుకుని, "కనలేక నొప్పులు పడుతూన్న కంగారు జంతువులా" ఉన్నాడు.. చేతి జబ్బకు తెల్లటి బ్యాండేజి కనపడుతోంది. వీధిలో పరిచయస్తులు స్నేహితులు అతని చుట్టూ నిలబడి పరామర్శిస్తున్నారు.

" రండిసార్! రండి! మీరూ చెప్పుతో ఓ దెబ్బ కొడతారా.. ?

"ఇప్పుడే మా బావమరిది, కుక్కకాటుకు చెప్పు దెబ్బే మందనీ సాచిపెట్టి కొట్టి వెళ్ళాడు.." అదోలా, ఆంజనేయులు నవ్వాడు గానీ, ఆ నవ్వులో నాకు ఏడుపే కనిపించింది...

"భలేవారండీ మీరు.. అసలు మీమీద చేయెత్తడానికి ఎవరికి ధైర్యం ఉంటుంది చెప్పండి ? ఈ వీధిలో మీరు పెద్ద మనిషి. ఆ పెద్ద మనిషి తనంలోనూ కొన్ని ప్రత్యేకతలున్నాయి... ఏదో ఈరోజు కుక్క కరిచింది కాబట్టి.. మీ బావమరిది.. నా సాంత్వన పలుకులు పూర్తికాలేదు..

" మీ కేమైనా నా మీద కోపం, కసీ ఏవైనా ఉంటే ... నిరభ్యంతరంగా తీర్చుకోండి. సందేహించనక్కర్లేదు...!

ఆయాసపడుతూ అన్నాడు ఆంజనేయులు! అంటే .. బావమరిది చెప్పుతో కొట్టి, కసి తీర్చుకున్నాడన్నది అన్యాపదేశంగా అతని ఉద్దేశ్యం కాబోలు!

" అసలెలా జరిగిందండి... ? ఏ కుక్క కరిచింది మిమ్మల్ని .. ? అయినా జబ్బమీదకు ఎలా ఎగిరిందండీ... ? నేను వరుసగా ప్రశ్నలు సంధించాను. ఆంజనేయులు జవాబు చెప్పలేదు... పరామర్శ కొచ్చిన ఓ పెద్దమనిషి గొంతు విప్పాడు... " ఏ కుక్కో.. ఎలా కరిచిందో... ఎలా తెలుస్తుందండీ.. ? ప్రొద్దుటే, తెల్లవారకుండా, పాలప్యాకెట్ కోసం, బూత్ వద్దకు పరుగెడూతూ ఉంటే.... చీకట్లోంచి, భూతంలా ఎగిరి మరీ జబ్బపట్టుకుందంట! జబ్బ ఒక్కటేనేంవిటీ..? ఒళ్ళంతా గీకి పారేసింది."

అతను మాట్లాడుతుండగానే, మరొకతను అందుకున్నాడు. ఒకరి తరువాత, ఒకరు సానుభూతి వర్షం కురుస్తోంది.!

" అది మంచి కుక్కో .. చెడ్డ కుక్కో... ఏమైనా బొడ్డు చుట్టూ పధ్నాలుగు ఇంజక్షన్లు చేయించుకోవల్సిందే... "

" బొడ్డు బొప్పాసకాయలా వాచిపోతుందండీ బాబూ! ఆ నరకం...బాధ... హింస, మన ఆంజనేయులుగారు భరించగలరా... ?"

" భరించాలండీ... లేకపోతే ప్రాణానికే ప్రమాదం..?

" ఇప్పుడు బొడ్డు చుట్టూ అవసరంలేదు.. నడ్డిమీద నాలుగు ఇంజక్షన్లు

చేయించుకుంటే సరి... కాకపోతే ఓ రెండు వేల రూపాయలు ఖర్చవుతాయి... ప్రాణం కంటే డబ్బు ఎక్కువంటారా...?

" మీకు తెలుసో లేదో.... కుక్క మనల్ని కరిస్తే ఎంత ప్రమాదమో... దానికీ అంత ప్రమాదమే... అది చావకుండా బ్రతికుంటే, మనం ఇంజక్షన్లు చేయించుకోవనసరంలేదు... !"

"అది చచ్చిందో... బ్రతికిందో.. ఎక్కడుందో, ఎలా ఉందో.. ఎలా తెలుస్తుందీ...? ఈలోపుగానే ఆ " రేబీస్ వ్యాధి కమ్ముకొచ్చేసి... మన ఆంజనేయులుగారికి, పిచ్చి చేష్టలు పెద్ద ఎత్తున ముంచుకొచ్చేస్తే...

" ఇంతకూ ఆంజనేయులుగారు ఇంజక్షన్లు చేయించుకున్నారా...?లేదా...?" "ఏమో... నాకు అనుమానంవే... ఆయన పొదుపూ.. పద్ధతీ ఆలోచిస్తే... రకరకాల ఓదార్పులు... వ్యాఖ్యానాలు... సలహాలు ఆంజనేయులు మాత్రం పెదవి విప్పడం లేదు.... అందరివైపు అయోమయంగా చూస్తున్నాడు...!

ఇంతలో ఆంజనేయులు భార్య అనసూయమ్మ ట్రేలో టీలు తీసుకొచ్చి, వరండాలో కూర్చున్న వాళ్ళందరికీ అందించింది. భార్య వైపు ఉరిమి ఉరిమి చూశాడు ఆంజనేయులు...! ఇదేమైనా పండగా, పబ్బమా...? ఈమాత్రం పరామర్శకే వచ్చినవాళ్ళకి టీలు, సరఫరా చెయ్యాలా, అన్న భావం, అతని కళ్ళల్లో, ముఖంలో, ప్రస్ఫుటంగా ప్రతిఫలించింది. కక్కలేక, మింగలేక, కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు...! అనసూయమ్మను నేను విస్మయంగా చూశాను.... ఆవిడ ఎప్పుడోగాని వీధి వరండాలో కనిపించదు... అలాంటిది మా కందరకు టీలు అందించడం నాకు ఆశ్చర్యంగాతోచింది... అనసూయమ్మ అందరికీ టీలు అందించింది గానీ, ఆంజనేయులుకి మాత్రం ఇవ్వలేదు.... నా చేతిలోని టీ ఆంజనేయులుకి ఇవ్వబోయాను. అతను నా వైపు గుర్రుమని చూశాడు....

"మీరేం బెంగ పెట్టుకోకండి. మీ ఆరోగ్యం ముఖ్యం... అరడజను ఇంజక్షన్లూ పూర్తిగా చేయించుకోండి...!" నా మాటలకు ఆంజనేయులు సమాధానం చెప్పలేదు. కనీసం తల పంకించలేదు. నా వైపు ఓ వెర్రి చూపు చూస్తుండిపోయాడు."

జీవుడు ఇంకా, కుక్క కరిచిన షాక్‌లోనే ఉన్నాడనుకుంటూ, బయటికి నడిచాను!

రోడ్డుమీద నడుస్తున్నాను.

కుక్కలు చాలా మందిని కరుస్తాయి. ఆంజనేయుల్ని కరవడంలోనే విశేషం ఉంది. అతను ఉదయం లేచింది మొదలు, రాత్రి నిద్రపోయేవరకూ ఎవర్నో ఒకర్ని కరుస్తూనే ఉంటాడు. పన్నులు వసూలుచేయడంలోనో, నోటీసులు జారీ చేయడంలోనో... నోట్ల మీద అప్పులివ్వడంలోనో... వడ్డీలు వసూలు చేయడంలోనో... పెళ్ళాన్ని కొట్టడంలోనో పిల్లల్ని తిట్టడంలోనో... మనుషుల్ని కరవడం.... అతని నిత్యకృత్యం... !

ఇంటివైపుగా అడుగులు వేస్తున్నాను. ఎదురుగా - ఆంజనేయులు బావ మరిది బాబూరావు విసురుగా వస్తూ నాకు నమస్కరించాడు.

"మీ బావగారికి చెప్పు వైద్యం" ఘనంగా చేశావటగా! " నవ్వుతూ అన్నాను. "తప్పదుకదాండి, పెద్దలు చెప్పిన వైద్యం!" అతనూ అదోలా నవ్వాడు! ఆ నవ్వులోనూ నాకు అర్థం కాని భావాలేవో ఉన్నట్లనిపించాయి...!

నేను తిన్నగా ఇంటికి నడిచాను.. నా గదిలో కాలు పెట్టాను.

"ఆంజనేయులుగారు ఎలా ఉన్నారండీ...?" శ్రీమతి ఆత్రంగా అడిగింది. "ఆయనకేం బాగానే ఉన్నాడు.....కాక పోతే జీవుడు నోరు విప్పడంలేదు... కుక్క కరిచింది' అన్న షాక్ నుంచి ఇంకా తేరుకున్నట్టులేదు... నేను చెప్పాల్సింది చెప్పాను.... ఓరెండు వేలు ఖర్చయినా, ఇంజక్షన్లన్నీ పూర్తిగా చేయించుకోమనీ సలహా పడేసి వచ్చాను."

"అంతే లెండి! ఆ మాత్రం చెప్పడం మన కనీస కర్తవ్యం. ఎంతైనా ఇంటి యజమాని, పైగా వీధిలో పెద్దమనిషి..!"

శ్రీమతి మాటల్లో పెద్దమనిషి అన్న పదానికి అర్థాలు గుర్తుకు వచ్చి నాలో నేనే చిన్నగా నవ్వుకున్నాను.! మర్నాడు... మధ్యాహ్నం... ! భోజనానికి ఇంటికి వచ్చాను. వంటగదిలో శ్రీమతి గొంతుతోబాటు, మరో గొంతు వినబడుతూంది. ఆ గొంతు అనసూయమ్మది. ఆవిడ గతంలో మా ఇంటికి ఎప్పుడూ రాలేదు... అనసూయమ్మ నన్ను చూసి సిగ్గుపడినట్లుగా పక్కకు తప్పుకుని శ్రీమతితో వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిపోయింది.!

"ఏవండోయ్! మీకో షాకింగ్ న్యూస్ చెప్పనా...?" శ్రీమతి పగలబడి నవ్వుతూ నా ముందుకు వచ్చింది. పడీ పడీ నవ్వుతూ ఆ నవ్వును ఆపుకోలేనట్లుగా, "అమ్మా! అయ్యా!" అంటూ ఆయాసపడుతోంది.

' పూర్తిగా నవ్వేసేయ్... నవ్వడం ఆరోగ్యానికి చాలా మంచిది. విషయం నాకు చెప్పకపోయినా పరవాలేదు..." విసుగ్గా అని బాత్‌రూమ్‌వైపు అడుగులు వేశాను.

శ్రీమతి నాకు అడ్డంగా నిలబడింది.... "అది కాదండీ! ఆంజనేయులు గార్ని కుక్కకరిచిందన్నారు కదా!" శ్రీమతి అర్థోక్తిగా ఆగింది.

" అవును... ఆ విషయం నువ్వేగా చెప్పావు. నేను వెళ్ళి పరామర్శించి వచ్చాను...

" అదేలెండి! ఇప్పుడు ఆంజనేయులుగారి భార్య అనసూయమ్మ వచ్చింది కదా.. ఆవిడ చెప్పింది.. "ఏమనీ..."

"వాళ్ళాయన్ని కుక్కకరవలేదట... తనేకరిచిందట...'' నాకు నోట్లోంచి మాటరాలేదు...కొన్ని క్షణాలకు తేరుకున్నాను.

"ఆవిడ మొగుడ్ని కరిచిందా.. ఎందుకనీ?"

"ఎందుకంటారేంవిటండీ...? పెళ్ళాన్ని ఎల్లకాలం ఓ కుక్కలా చూసి, కొట్టి,తిట్టి, బానిసలా పడుండమంటే... ఏ ఆడది ఊరుకుంటుంది చెప్పండీ...? పూర్వం పతివ్రతలకాలంకాదు గదా ఇది..? ఆ ఇంట్లో కనీస స్వేచ్ఛలేదట... గడపదాటడానికి లేదట పొరుగువారితే మాట్లాడకూడదట, ఓఅభిమానం లేదట.. ఆప్యాయతలేదట... ఏనాడూ పెదవి

విప్పని అనసూయ మొగుడి మీద తిరగబడింది... పైగ, నువ్వు సరదాకి, సంసారానికి ఇక పనికిరావు... నేను మరో ఆడదాన్ని తెచ్చిపెట్టుకుంటాను అన్నాట్ట ఆంజనేయులు! అంతేనా! ఇంట్లో ఓ కుక్కలాపడి ఉండు... నోరెత్తావంటే, కుక్కను కొట్టినట్టు కొడతానూ అన్నాట్ట.. అంతే ఆవిడ కుక్కలా మీదపడి... కసికొద్దీ జబ్బమీద కరిచి ఒళ్ళంతా గీకి... "శ్రీమతి తెరతెరలుగా నవ్వి చటుక్కున ఆగిపోయింది... ! ఆమె కళ్ళలోంచి ఏదో ఉద్వేగం ఉబికి వస్తుంది. ఆ ఉద్వేగంలో నా కళ్ళకు ఆమె కొత్త మనిషిలా కనబడుతోంది... నేనో అడుగు వెనక్కి వేశాను.

"అంటే ఆడవాళ్ళు కరుస్తారన్నమాట..." తడబడుతూన్నట్లుగా అన్నాను.

"వాళ్ళకు అన్యాయం జరిగితే ముందు అరుస్తారండీ...! గత్యంతరం లేకపోతేనే కరుస్తారు... !" శ్రీమతి గంభీరంగా అని, వంటగదిలోకి వెళ్ళిపోయింది...!

నాలో ఆలోచనల దుమారం... ! ఆడదాన్ని ఓ కుక్కలా భావించే, ఆంజనేయులుకి ఆ మాత్రం జరగాల్సిందే.... ! ఆ ఇంట్లో తిరుగుబాటు రావాల్సిందే.... ! అతనికి కట్టుకున్న భార్య మీదే కాదు... ఆడవాళ్ళందరి మీద, వాళ్ళ వ్యక్తిత్వాల మీద చిన్నచూపే... !

కుక్కకరిస్తే ఇంజక్షన్లు చేయించుకోవచ్చు... మనిషి కరిస్తే ఇంకా ప్రమాదమేమో...! అందునా ఆడవాళ్ళు కరిస్తే.... ? అమ్మో...!

❁ ❁ ❁ ❁ ❁ ❁

(ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం
సంక్రాంతి హాస్యకథల పోటీ - ద్వితీయ బహుమతి 21.1.96)